క్లుప్తంగా

ధాన్యం కొనుగోళ్ల పరిశీలన



కొనుగోలు కేంద్రాన్ని పరిశీలిస్తున్న కొమురయ్య

హత్నూర (సంగారెడ్డి): హత్నూర మండలంలోని దౌలాపూర్ ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని డీపీఎం కొమురయ్య సోమవారం పరిశీలించారు. కొనుగోళ్లు వేగవంతం చేయాలని సూచించారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా అన్ని సౌకర్యాలు కల్పించాలని సూచించారు. ప్రతిరోజూ ధాన్యం తేమశాతం పరిశీలించాలన్నారు. ఆయన వెంట ఏపీఎం దామోదర్ ఉన్నారు.

కొనుగోలు కేంద్రాల్లోనే విక్రయించాలి

ఎమ్మెల్యే సంజీవరెడ్డి



పత్తి కొనుగోళ్లను ప్రారంభిస్తున్న సంజీవరెడ్డి

నారాయణఖేడ్: రైతులు తమ పంటలను కొనుగోలు కేంద్రాల్లోనే విక్రయించి మద్దతు ధర పొందాలని ఎమ్మెల్యే డాక్టర్ సంజీవరెడ్డి పేర్కొన్నారు. మండలంలోని పైడిపల్లి శివారులోని లక్ష్మీజిన్నింగ్ మిల్లులో సోమవారం పత్తి కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రైతులకు మద్దతు ధరను అందించాలనే లక్ష్యంతో ప్రభుత్వం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేస్తోందన్నారు. దళారులకు విక్రయించి మోసపోవద్దని సూచించారు. నాయకులు గుండే రావు, లక్ష్మి, మిల్లు సిబ్బంది ఎమ్మెల్యేను శాలువాతో సన్మానించారు.

మందుబాబులకు జరిమానా

సంగారెడ్డి క్రైమ్: పట్టణంలో ఆదివారం అర్ధరాత్రి ట్రాఫిక్ ఎస్‌ఐ సుమన్ కుమార్ ఆధ్వర్యంలో డ్రంక్ అండ్ డ్రైవ్‌లో భాగంగా పోతిరెడ్డిపల్లి చౌరస్తా వద్ద ప్రత్యేక తనిఖీలు నిర్వహించారు. నలుగురు వాహనదారులు మద్యం సేవించి పట్టుపడ్డారు. వారిని సోమవారం సంగారెడ్డి జిల్లా కోర్టులో హాజరుపరచగా ఒక్కొక్కరికి రూ. 2000 చొప్పున జరిమానా విధించినట్లు ట్రాఫిక్ పోలీసులు పేర్కొన్నారు.

హరీశ్‌రావును కలిసిన నాయకులు



మునిపల్లి(అందోల్): మాజీ మంత్రి హరీశ్‌రావును మునిపల్లి మండల బీఆర్‌ఎస్ నాయకులు కలిశారు. సోమవారం మండలంలోని తాటిపల్లి గ్రామానికి చెందిన నాయకులు, బీఆర్‌ఎస్ యువత రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సాయికుమార్ ఆధ్వర్యంలో మాజీ మంత్రిని కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు.

బాలిక అదృశ్యం

పటాన్‌చెరు టౌన్: బాలిక అదృశ్యమైన సంఘటన అమీన్‌పూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. అమీన్‌పూర్ మున్సిపాలిటీ పరిధిలోని కృష్ణారెడ్డి పేటకు చెందిన ఓ బాలిక (16) సోమవారం ఉదయం ఇంట్లో చెప్పకుండా వెళ్లిపోయింది. దీంతో కుటుంబ సభ్యులు తెలిసిన వారి వద్ద, స్థానికంగా వెతికిన ఆచూకీ లభించలేదు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

ఘనంగా మహాపడి పూజ



పడిపూజలో పాల్గొన్న స్వాములు

వట్‌పల్లి(అందోల్): అందోల్ మండలంలోని కన్‌సాన్‌పల్లిలో ఉన్న ఈశ్వరాలయంలో అయ్యప్ప మహాపడి పూజను సోమవారం వైభవంగా నిర్వహించారు. లక్ష్మణ్ గురుస్వామి ఆధ్వర్యంలో అయ్యప్ప స్వామికి ప్రత్యేక అభిషేకాలు నిర్వహించారు. స్వాములు శరణు ఘోషల మధ్య భజనలు, కీర్తనలు పాడుతూ పడిపూజ నిర్వహించారు. కార్యక్రమంలో అయ్యప్ప స్వాములు ఆనంద్‌శర్మ, ప్రకాశం గురుస్వామి, యాదగిరి, మాణిక్యంస్వామి, ఆంజనేయులు, చంద్రయ్యస్వామి, కళ్యాణ్ పాల్గొన్నారు.

స్టాండింగ్ కౌన్సిల్ న్యాయవాదిగా శ్రీధర్‌రెడ్డి



జహీరాబాద్: రాష్ట్ర హైకోర్టు ట్రాన్స్‌కో స్టాండింగ్ కౌన్సిల్ న్యాయవాదిగా మండలంలోని చిరాగ్‌పల్లి గ్రామానికి చెందిన ఎస్.శ్రీధర్‌రెడ్డి నియమితులయ్యారు. ఈ మేరకు ప్రభుత్వం నియామక ఉత్తర్వులు జారీ చేసినట్లు కాంగ్రెస్ నాయకులు పేర్కొన్నారు. నియామకానికి సహకరించిన వారికి శ్రీధర్‌రెడ్డి కృతజ్ఞతలు తెలిపారు.

భక్తుల సందడి

న్యాల్‌కల్(జహీరాబాద్): మండలంలోని రేజింతల్ గ్రామ శివారులో స్వయంభుగా వెలసిన సిద్ధివినాయక ఆలయంలో భక్తుల సందడి చేశారు. సోమవారం సంకష్టహర చతుర్థిని పురస్కరించుకొని భక్తులు అధిక సంఖ్యలో ఆలయానికి తరలివచ్చారు. సంకష్టహర చతుర్థి నాడు స్వామివారిని దర్శించుకుంటే కోరిన కోర్కెలు నెరవేరుతాయని భక్తుల నమ్మకం. జిల్లాలోని నలుమూలల నుంచే కాకుండా కర్నాటక, మహారాష్ట్రాలకు చెందిన భక్తులు పెద్దసంఖ్యలో ఆలయానికి తరలివచ్చి స్వామివారిని దర్శించుకున్నారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ట్రస్టు సభ్యులు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు.



స్వామివారికి పూజలు చేస్తున్న అర్చకులు

కిటకిటలాడిన శివాలయాలు

పటాన్‌చెరు టౌన్: శివుడికి అత్యంత ప్రీతికరమైన మాసం కార్తీకమాసం మూడో సోమవారం తెల్లవారుజాము నుంచే శివాలయాలు భక్తులతో కిటకిటలాడాయి. పట్టణంలోని జేపీకాలనీలోని ఉమా మహేశ్వర దేవస్థానం, టోల్‌గేట్ సమీపంలోని రామలింగేశ్వర దేవస్థానం, చైతన్‌నగర్ కాలనీలోని మహాదేవుని ఆలయాల్లో అర్చకులు పంచామృత అభిషేకాలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. మహిళలు శివాలయాల పరిసరాలలో దీపాలు వెలిగించి మొక్కులు చెల్లించుకున్నారు. ఉమామహేశ్వర దేవస్థానం, రామలింగేశ్వర దేవస్థానంలో సామూహిక సత్యనారాయణ వ్రతాలు, భస్మాభిషేకం నిర్వహించి, అన్నదానం చేశారు.



సామూహిక సత్యనారాయణ వత్రం పూజలు చేస్తున్న భక్తులు

శనగ వైపు.. రైతుల చూపు

- యాసంగిలో శనగ, జొన్న పంటలపై ఆసక్తి
- సాగు పనులు ప్రారంభించిన అన్నదాతలు

రాయికోడ్(అందోల్): వానాకాలంలో పత్తిసాగు చేసిన రైతులు ఆశించిన దిగుబడి రాకపోవడంతో యాసంగిలో శనగ పంట సాగు వైపు మొగ్గు చూపుతున్నారు. మూడు వారాల నుంచి మండలంలో పత్తితీత పనులు చేపట్టారు. ఒకటే విడతలో పత్తితీత పూర్తి చేసిన రైతులు ఆశించిన దిగుబడి రాకపోవడంతో శనగ పంటను సాగు చేయడంపై దృష్టి సారించారు. మండలంలోని ఆయా గ్రామాల్లో గత ఏడాది 4,223 ఎకరాల్లో శనగ సాగు చేసినట్లు వ్యవసాయ అధికారులు తెలిపారు. వాతావరణం అనుకూలంగా ఉండటంతో రైతులు ప్రస్తుతం పత్తితీత పూర్తవగానే శనగ పంట సాగు పనులు ప్రారంభించారు. ఎకరాకు 6 నుంచి 8 క్వింటాళ్ల శనగ పంట దిగుబడి వస్తుందని రైతులు చెబుతున్నారు. నీటి సౌకర్యం ఉన్న రైతులు శనగ వేసిన పొలాల్లో నీటి తడులను అందిస్తున్నారు. వానాకాలం పంటలు ఆశించిన దిగుబడి రాకపోవడంతో శనగతో పాటు జొన్న పంటను సాగు చేసేందుకు మొగ్గు చూపుతున్నట్లు రైతులు తెలిపారు. రైతుల ఆసక్తిని దృష్టిలో ఉంచుకుని వ్యవసాయ శాఖ ద్వారా మండల రైతులకు 100 క్వింటాళ్ల శనగ విత్తనాలను పంపిణీ చేసినట్లు అధికారులు తెలిపారు. ప్రభుత్వం సరఫరా చేసిన శనగ విత్తనాలనే కాకుండా పలువురు ప్రైవేటుగా విత్తనాలను కొనుగోలు చేసి సాగు పనులు చేపట్టారు. వచ్చే నెల 15 వరకు శనగ పంట విత్తనాలు విత్తుకునేందుకు గడువు ఉందని వ్యవసాయ శాఖ ఏడీఏ సత్యనారాయణ తెలిపారు.



రాయికోడ్‌లో శనగ పంటకు నీటిని అందిస్తున్న రైతు



మొలకెత్తిన శనగ పంట

సూచనలు పాటించాలి

శనగ పంట సాగులో వ్యవసాయ అధికారుల సూచనలు పాటించాలి. తక్కువ పెట్టుబడితో ఆశించిన దిగుబడి పొందేందుకు అధికారుల ద్వారా సలహాలు, సూచనలు తీసుకోవాలి. డిసెంబర్ 15వ తేదీ వరకు శనగ విత్తనాలను పెట్టుకుంటే పంట దిగుబడి ఆశించిన మేరా దిగుబడి వచ్చే అవకాశాలు ఉంటాయి. అదును దాటాకా పంట సాగు చేయకపోవడం ఉత్తమం. -సారిక, ఏఓ రాయికోడ్

విత్తన మినీ కిట్ల పంపిణీ

జహీరాబాద్: మండలంలోని ధనాసిరి గ్రామంలో సంగుపేటలోని ఏరువాక కేంద్రం శాస్త్రవేత్తల ఆధ్వర్యంలో రైతులకు శనగ విత్తనాల మినీ కిట్లను పంపిణీ చేశారు. సోమవారం శాస్త్రవేత్త రాహుల్ విశ్వకర్మ మాట్లాడుతూ.. శనగ మినీ కిట్ల ప్రయోగాల వల్ల రైతులకు నూతన రకాల లక్షణాలు, పంటల్లో తెగుళ్లను తట్టుకునే గుణం ఎంతవరకు ఉంటుందనే విషయాల గురించి వివరించారు. ఈ సందర్భంగా యాసంగికి ఏడీబీజీ-2 మినీ శనగ విత్తన కిట్లను రైతులకు ఉచితంగా అందజేశారు. అనంతరం రంజోల్ గ్రామంలోని వ్యవసాయ పంటలను పరిశీలించారు. ఆయిల్ పామ్ పంటలో కొమ్ము పురుగు యాజమాన్యం, నివారణ చర్యల్లో భాగంగా బకెట్ ట్రాప్ ఎర అమర్చారు. ఏరువాక కేంద్రం శాస్త్రవేత్త సరిత మామిడిలో గూడుకట్టు పురుగు నివారణ చర్యలు, నీటి యాజమాన్య పద్ధతుల గురించి తెలిపారు. కార్యక్రమంలో ఏఈఓలు ప్రదీప్‌కుమార్, ఏరువాక కేంద్రానికి చెందిన శ్రీకాంత్, రైతులు పాల్గొన్నారు.



కిట్లను పంపిణీ చేస్తున్న శాస్త్రవేత్తలు

పెండింగ్ నిధులు విడుదల చేయండి

సంగారెడ్డి ఎడ్యుకేషన్: రాష్ట్ర వ్యాప్తంగా పెండింగ్‌లో ఉన్న బెస్ట్ అవైలబుల్ స్కీం నిధులు తక్షణమే విడుదల చేయాలని ఎస్ఎఫ్ఐ, కేవీపీఎస్ జిల్లా కార్యదర్శి మహేశ్, అశోక్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం కలెక్టర్ కార్యాలయంలో అదనపు కలెక్టర్ చంద్రశేఖర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. రాష్ట్రంలో కార్పొరేట్, ప్రైవేటు పాఠశాలలో సోషల్ వెల్ఫేర్, గిరిజన సంక్షేమ శాఖల సహకారంతో బెస్ట్ అవైలబుల్ స్కీం కింద దళిత పిల్లలు 19వేల మంది, గిరిజన పిల్లలు 6 వేలమంది విద్యను అభ్యసిస్తున్నారని తెలిపారు. ప్రతి ఏటా ఫీజులు చెల్లించాల్సిన రాష్ట్ర ప్రభుత్వం గత రెండు సంవత్సరాలుగా రూ.175 కోట్లు చెల్లించకపోవడంతో విద్యార్థుల చదువులకు కోత పడే అవకాశం ఉందన్నారు. గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం 8 నెలలకు సంబంధించిన బిల్లులు చెల్లించలేదన్నారు. ప్రస్తుతం కాంగ్రెస్ ప్రభుత్వం కూడా ఈ బిల్లులు చెల్లించకపోవడంతో పేద విద్యార్థుల తమ చదువులు నష్టపోతున్న పరిస్థితి ఉందన్నారు. కార్యక్రమంలో కేవీపీఎస్ జిల్లా ఉపాధ్యక్షుడు ఎం. శివకుమార్ ఎస్ఎఫ్ఐ నాయకులు రవి, సాయి ,పాల్గొన్నారు.



అదనపు కలెక్టర్‌కు వినతిపత్రం ఇస్తున్న నేతలు

పీసీసీ అధ్యక్షుడికి ఘన స్వాగతం



మహేశ్‌గౌడ్‌ను గజమాలతో సత్కరిస్తున్న శ్రేణులు

పటాన్‌చెరు టౌన్: పీసీసీ ముఖ్య సమావేశానికి సంగారెడ్డికి వెళ్తున్న పీసీసీ అధ్యక్షుడు బొమ్మ మహేశ్ కుమార్ గౌడ్‌కి నీలం మధు సోమవారం ఇస్నాపూర్ చౌరస్తాలో పటాన్‌చెరు పార్టీ శ్రేణులతో కలిసి గజమాలతో సత్కారించి, ఘన స్వాగతం పలికారు. అక్కడి నుంచి నీలంమధు తన అనుచరులతో, భారీ కాన్వాయ్‌తో సంగారెడ్డికి తరలివెళ్లారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నేత గాలి అనిల్‌కుమార్, పీసీసీ మెంబర్ శ్రీనివాస్ రెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు శ్రీశైలం, శ్రీకాంత్ రెడ్డి, కార్పొరేటర్ పుష్ప నగేష్,పటాన్‌చెరు మండల కాంగ్రెస్ అధ్యక్షుడు సుధాకర్ గౌడ్, పటాన్ చెరు పట్టణ, ఐఎన్‌టీయూసీ జిల్లా అధ్యక్షుడు నరసింహారెడ్డి పాల్గొన్నారు.

ఆర్టీసీని సద్వినియోగం చేసుకోండి

నారాయణఖేడ్: తీర్థయాత్రలు, శుభకార్యాలకు ఆర్టీసీ బస్సుల సేవలను సద్వినియోగం చేసుకోవాలని ఖేడ్ ఆర్టీసీ డీఎం మల్లేశయ్య కోరారు. సోమవారం అయ్యప్ప దీక్షాదారులతో కలిసి తీర్థయాత్రలు, శుభకార్యాలకు ఆర్టీసీ సంస్థ బస్సులను ఏర్పాటు చేస్తున్న కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బుకింగ్ చేసుకునే ఆయా బస్సులకు గతేడాది కన్నా చార్జీలను సంస్థ బాగా తగ్గించినట్లు తెలిపారు. శబరిమలై వెళ్లడానికి బస్సులను బుక్ చేసుకునే విధానాన్ని వివరించారు. గురుస్వాములు శివానంద్, పాండు, రమేష్, సంజయ్, ప్రశాంత్, ఓంప్రకాష్, ఆర్టీసీ మార్కెటింగ్ సెల్ ఇన్‌చార్జి పాండు, బుకింగ్ ఇన్‌చార్జి రాధాకృష్ణ, శివశంకర్ పాల్గొన్నారు.



కరపత్రాలను ఆవిష్కరిస్తున్న డీఎం మల్లేశయ్య

నేడు విద్యుత్ అంతరాయం

సంగారెడ్డి రూరల్: నేడు పట్టణంలోని టౌన్ 2 పరిధిలో విద్యుత్ అంతరాయం ఏర్పడనున్నట్లు ఏఈస్వామి సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. చెట్ల నరికివేత, మెయింటెన్స్ కారణంగా ఉ.10 నుంచి మ.2 గంటల వరకు వసంతనగర్, ఓడీఎఫ్ కాలనీ, ప్రగతినగర్, శ్రీ చక్ర వెంచర్, ద్వారకానగర్, బృందావన్ కాలనీలో సరఫరా నిలిపేయనున్నట్లు చెప్పారు.

జిన్నారంలో..

జిన్నారం (పటాన్‌చెరు): బొల్లారం పారిశ్రామికవాడలోని సబ్‌స్టేషన్ 3లో ఎల్వీ ఫీడర్ మరమ్మతుల కారణంగా పారిశ్రామిక వాడతో పాటు పాత బొల్లారంలో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఏడీఈ మాధవరావు పేర్కొన్నారు. ఉ.10 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు నిలిపివేస్తున్నట్లు తెలిపారు.

సమగ్ర సర్వే పరిశీలన



సర్వేను పరిశీలిస్తున్న ఎంపీఓ శ్రీనివాస్

కల్హేర్(నారాయణఖేడ్): మండలంలో ఇంటింటా సమగ్ర సర్వేను సోమవారం నిర్వహించారు. ఇన్‌చార్జి ఎంపీడీఓ సంగ్రామ్, ఎంపీఓ శ్రీనివాస్ సర్వేను పరిశీలించారు. సర్వేలో పూర్తి వివరాలు అందజేయాలని కోరారు. కార్యక్రమంలో పంచాయతీ సెక్రటరీలు కృష్ణాచారి, రాజు, పవన్, ఎన్యుమరేటర్లు పాల్గొన్నారు.

విద్యార్థులు క్రీడల్లో రాణించాలి

అదనపు కలెక్టర్ మాధురి

పటాన్‌చెరు టౌన్: విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లో రాణించాలని జిల్లా అదనపు కలెక్టర్ మాధురి అన్నారు. సోమవారం పటాన్‌చెరు మండలం ముత్తంగి జ్యోతిబాపూలే బాలికల గురుకుల పాఠశాలలో జిల్లాస్థాయి అండర్ -14, అండర్-19 క్రీడాపోటీలను మాధురి, జిల్లా బీసీ వెల్ఫేర్ అధికారి జగదీష్‌లతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. క్రీడాపోటీల్లో 15 పాఠశాలలు, 10 కళాశాలలకు సంబంధించి 650 మంది విద్యార్థులు పాల్గొన్నారని, మూడు రోజుల పాటు ఈ క్రీడలు కొనసాగుతాయని తెలిపారు. కార్యక్రమంలో ఉమ్మడి మెదక్ జిల్లా ఆర్సీఓ గౌతం కుమార్‌రెడ్డి, కళాశాల ప్రిన్సిపాల్ నవనీత, ఇతర కళాశాలల ప్రిన్సిపాల్, అధ్యాపకులు, ఉపాధ్యాయులు, వ్యాయమ ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.



క్రీడలను ప్రారంభించిన అదనపు కలెక్టర్ మాధురి

కక్షిదారులకు సత్వర న్యాయం

జిల్లా న్యాయ సేవాధికారి సంస్థ కార్యదర్శి రమేష్

సంగారెడ్డి టౌన్: కక్షిదారులకు సత్వర న్యాయం అందించాలని జిల్లా న్యాయ సేవాధికారి సంస్థ కార్యదర్శి రమేష్ అన్నారు. సోమవారం జిల్లా కోర్టులో బ్యాంక్, చిట్ ఫండ్ అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. లోక్ అదాలత్‌లో ఎక్కువ కేసులు పరిష్కరించి, కక్షిదారులకు సత్వర న్యాయం అందించాలన్నారు. మోటార్ వాహనప్రమాద నష్టపరిహార కేసులు పరిష్కరించి నష్టపరిహారం ఇప్పించాలన్నారు. చిట్ ఫండ్ కేసులు ఎక్కువ మొత్తంలో పరిష్కరించాలన్నారు. కార్యక్రమంలో జిల్లా జడ్జిలు, న్యాయవాదులు, బ్యాంక్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న రమేష్



మహేశ్ కుమార్‌గౌడ్‌ను సన్మానిస్తున్న ఖదీర్

పీసీసీ అధ్యక్షుడికి సన్మానం

రామచంద్రాపురం (పటాన్‌చెరు): పీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్‌గౌడ్‌ను స్థానిక నాయకులు షేక్ అబ్దుల్‌ఖదీర్ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా స్థానిక విలేకరులతో ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకువెళ్లి వివరిస్తున్నామని తెలిపారు. సంగారెడ్డి వెళ్తున్న పీసీసీ అధ్యక్షుని సన్మానించినట్లు తెలిపారు.

తండాల అభివృద్ధికి కృషి చేయండి

నారాయణఖేడ్: గిరిజనుల సంక్షేమం, తండాల్లో మౌలిక సదుపాయాలు కల్పనకు కృషి చేయాలని ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్ కమిటీ జిల్లా మాజీ సభ్యుడు రవీందర్‌నాయక్, మాజీ జెడ్పీటీసీ లక్ష్మీబాయి కోరారు. హైదరాబాద్‌లో రాష్ట్ర గిరిజన సంక్షేమశాఖ కార్యదర్శి డాక్టర్ శరత్‌ను సోమవారం కలిసి పలు సమస్యలపై వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. జిల్లాలోని ఆయా తండాల్లో రోడ్లకు మరమ్మతులు, రోడ్లు లేని తండాలకు రోడ్లు వేయాలన్నారు. గిరిజన సంక్షేమానికి సంబంధించిన పలు పథకాలకు నిధులు విడుదల కావడంలేదని, అన్ని సంక్షేమ పథకాల నిధులు విడుదలయ్యేలా చూడాలని విన్నవించారు. గిరిజనులకు ఉద్యోగ, ఉపాధి, తండాల్లో విద్యాభివృద్ధికి కృషి చేయాలని కోరారు. కార్యదర్శి డాక్టర్ శరత్ సానుకూలంగా స్పందించినట్లు తెలిపారు.



డాక్టర్ శరత్‌ను కలిసిన నాయకులు

సంక్షిప్త వార్తలు

◆ బాధిత కుటుంబానికి పరామర్శ

కల్హేర్(నారాయణఖేడ్): సిర్గాపూర్ మండలంలోని చీమల్‌పాడు గ్రామంలో అనారోగ్యంతో మృతి చెందిన బీఆర్‌ఎస్ కార్యకర్త ఏశప్ప కుటుంబాలను సోమవారం నారాయణఖేడ్ మాజీ ఎమ్మెల్యే ఎం.భూపాల్‌రెడ్డి పరామర్శించారు. ఏశప్ప భౌతికకాయానికి నివాళులర్పించారు. ఆయన వెంట బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు సంజీవరావు, నాయకులు బస్వరాజ్ పటేల్, రాజు, సురేందర్ ఉన్నారు.

బాధితుడికి..

నారాయణఖేడ్: నాగల్‌గిద్ద మండలంలోని ఎర్రబ్రొగడ గ్రామ కాంగ్రెస్ పార్టీ కార్యకర్త స్వామిదాస్ ఇటీవల రోడ్డు ప్రమాదంలో గాయపడి ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. సోమవారం ఎమ్మెల్యే సంజీవరెడ్డి ఆస్పత్రికి వెళ్లి పరామర్శించారు. మెరుగైన వైద్యం అందించాలని వైద్యులను కోరారు. ఆయన వెంట మాజీ సర్పంచ్ పాటిల్, మాజీ ఎంపీటీసీ పండరిరెడ్డి ఉన్నారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

పటాన్‌చెరు టౌన్: చికిత్స పొందుతూ ఓ వ్యక్తి మృతి చెందిన సంఘటన పటాన్‌చెరు పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. వికారాబాద్ జిల్లా, తిమ్మారెడ్డిపల్లికి చెందిన పెంటయ్యగౌడ్(51), పటాన్‌చెరు మండలం, ముత్తంగి న్యూటన్ కాలనీలో ఉంటూ రుద్రారం తోషిబా పరిశ్రమలో కాంట్రాక్ట్ లేబర్‌గా పని చేస్తున్నాడు. ఈ క్రమంలో ఈ నెల 16 రాత్రి మద్యం తీసుకునేందుకు రుద్రారం తోషిబా పరిశ్రమ సమీపంలో ఉన్న మద్యం దుకాణానికి వెళ్లి మద్యం తీసుకొని రోడ్డు దాటుతుండగా, గుర్తుతెలియని వాహనం ఢీకొట్టింది. చికిత్స నిమిత్తం సంగారెడ్డి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అక్కడి నుంచి మెరుగైన చికిత్స కోసం ఉస్మానియా ఆస్పత్రికి తరలించగా అక్కడ చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందాడు. పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు చెప్పారు.

◆ వేతనం అందజేత

జిన్నారం (పటాన్‌చెరు): ప్రాథమిక పాఠశాలలో ఉపాధ్యాయుల కొరత ఉండటంతో స్థానికుల విజ్ఞప్తి మేరకు పనిచేస్తున్న విద్యావాలంటరీకి మాదారం గ్రామ మాజీ సర్పంచ్ సరిత వేతనం అందజేసింది. సోమవారం పాఠశాల విద్యా వాలంటర్ వద్ద మహేశ్వరికి ఒక నెల వేతనం రూ.5 వేల నగదును గ్రామ బీఆర్‌ఎస్ పార్టీ అధ్యక్షుడు గణేష్ అందించారు. విద్యాభివృద్ధికి కృషి చేస్తున్న వాలంటీర్‌కు అండగా ఉంటామని నాయకులు గణేష్ తెలిపారు.

◆ వైద్య ఖర్చులకు ఆర్థిక చేయూత

జిన్నారం (పటాన్‌చెరు): గుమ్మడిదల మండలం మంబాపూర్‌కు చెందిన పెంటయ్య అనారోగ్య సమస్యతో బాధపడుతున్నాడు. విషయం తెలుసుకున్న బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకులు సీజీఆర్ ట్రస్ట్ చైర్మన్ గోవర్ధన్ రెడ్డి బాధితుడిని పరామర్శించి, ఆర్థిక సహాయం అందజేశారు. కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు కొత్తపల్లి ప్రభాకర్‌రెడ్డి, దేవేందర్ రెడ్డి మల్లేష్‌గౌడ్, శ్రీనివాస్‌రెడ్డి, శంకర్, హనుమంత్ రెడ్డి, గౌరీ శంకర్ గౌడ్, మొగలయ్య, లక్ష్మణ్, రమేష్, సీజీఆర్ ట్రస్ట్ సభ్యులు పాల్గొన్నారు.

◆ దుకాణ సముదాయం ప్రారంభం

సదాశివపేట(సంగారెడ్డి): హట్కర్‌పేట, బంగారు మైసమ్మ మందిరం ఆలయ కమిటీ ఆధ్వర్యంలో నిర్మించిన దుకాణ సముదాయాన్ని సోమవారం మున్సిపల్ చైర్ పర్సన్ అపర్ణ ప్రారంభించారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ జిల్లా నాయకుడు సాయినాథ్, మున్సిపల్ వైస్ చైర్మన్ గోపాల్, కోఆప్షన్ మెంబర్ ఖలీమ్‌పటేల్, మాజీ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ శ్రీధర్‌రెడ్డి, ఆలయ కమిటీ అధ్యక్షుడు మనోహర్, ప్రధాన కార్యదర్శి మల్లేశం పాల్గొన్నారు.

◆ ఘనంగా భక్తకనకదాస్ జయంతి

నారాయణఖేడ్: భక్తకనకదాస్ గొప్ప ఆధ్యాత్మికవేత్త అని కురుమసంఘం బాధ్యులు కొనియాడారు. సోమవారం సంఘం ఆధ్వర్యంలో భక్తకనకదాస్ 515వ జయంతిని నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. సంఘం ఖేడ్ నియోజకవర్గ అధ్యక్షుడు ప్రభాకర్ కురుమ, గౌరవ అధ్యక్షుడు అంజన్న, యువత విభాగం ఉపాధ్యక్షుడు, ఖేడ్ మండల బీజేపీ అధ్యక్షుడు సిందోల్ దశరథ్ పాల్గొన్నారు.

◆ కరపత్రాల ఆవిష్కరణ

జహీరాబాద్ టౌన్: కర్నాటకలోని బసవకల్యాణ్‌లో ఈ నెల 23 నుంచి రెండు రోజులు జరిగిన అనుభవ మండప ఉత్సవాల కరపత్రాన్ని ఆదివారం జహీరాబాద్‌లోని దత్తగిరి కాలనీ బసవ మండపంలో ఆవిష్కరించారు. కార్యక్రమంలో రాష్ట్రీయ బసవదళ్ తెలంగాణ అధ్యక్షుడు శంకర్‌పాటిల్, జహీరాబాద్ నాయకులు పాల్గొన్నారు.

◆ గ్రామాభివృద్ధిపై నిర్లక్ష్యం

జహీరాబాద్ టౌన్: అల్గోల్ పరిధిలోని అల్లన పరిశ్రమ యాజమాన్యం గ్రామాభివృద్ధిని పట్టించుకోవడంలేదని మండల బీఆర్‌ఎస్ అధ్యక్షుడు చల్లా శ్రీనివాస్‌రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. స్థానికులను కాదని పరిశ్రమలో పనిచేసేందుకు బీహార్ ,యూపీ, పశ్చిమ బెంగాల్ యువకులను రప్పిస్తున్నారని ఆరోపించారు. కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీ నిధులతో గ్రామంలో అభివృద్ధి పనులు చేయాల్సి ఉండగా మొక్కుబడిగా చేస్తున్నారన్నారు. తాగునీరు, పారిశుద్ధ్యం పనులపై నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుందన్నారు. అభివృద్ధి పనులు చేపట్టని పక్షంలో న్యాయపోరాటం చేస్తామని హెచ్చరించారు.